క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పోచమ్మమైదాన్, కేఎంసీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



హన్మకొండ: లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఎల్‌ఓసీలను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పంపిణీ చేశారు. హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని తన స్వగృహంలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ.11,22,500 విలువ గల చెక్కులు, ఎల్‌ఓసీను ఆయన అందించారు.

శ్రమజీవుల హక్కుల రక్షణకు కృషి

వరంగల్: కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా శ్రమ జీవుల హక్కుల కోసం, దోపిడీ వ్యవస్థ అంతంకోసం పోరాడేందుకు ప్రతీఒక్కరు ప్రతినబూనాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని కార్మిక, కర్షక, శ్రమజీవులంతా ఘనంగా జరుపుకోవాలని కోరారు. అమెరికాలోని చికాగో పోరాట స్ఫూర్తితో పోరాడాలని సూచించారు. బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని వాపోయారు. మే డే రోజు అరుణ పతాకాలు ఎగురవేయాలని ఆయన సూచించారు.

బీజేపీ అధికారంలోకి వస్తేనే మేలు



కాజీపేట: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలన్నింటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం సాయంత్రం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీకి అండగా నిలవాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో చిర్ర నర్సింగ్‌గౌడ్, గుంటి కుమారస్వామి, ఎండీ.చాంద్‌పాషా, ఆకుల శ్రీకాంత్, గందసిరి శ్రీకాంత్, నర్మెట్ట శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

ఖిలా వరంగల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాను ప్రతీఒక్కరు అరికట్టాలని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ సుదర్శన్ సూచించారు. వరంగల్ తూర్పుకోటలో సూపర్‌వైజర్ పద్మలత, అంగన్‌వాడీ టీచర్ రజని అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు ఆహారం అందజేత

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలకు ఆహారం, బ్రెడ్లను హనుమకొండ రాయపురకు చెందిన కుశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. వేసవిలో మూగజీవాలకు తాగునీరు, ఆహారం అందక అవి అనారోగ్య బారిన పడుతాయని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడాల కుశాల్ అన్నారు. ఈక్రమంలో వాటికి అండగా నిలవాలని కోరారు.

'వసూళ్లకు పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలి'

కాశిబుగ్గ: దళితబంధు పథకంలో వసూళ్లకు పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ వరంగల్ ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. దళితబంధు రెండో విడతలో ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ విధానంలో అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హన్మకొండ: దళితరత్న అవార్డు గ్రహీత తంపుల రాజేందర్‌ను దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ మండలం కొండపర్తికి చెందిన రాజేందర్‌ను డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాతు రమేష్ కుమార్, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగారపు రవిప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, బహుజనుల చైతన్యం కోసం రాజేందర్ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధ్వంసమైన మురుగునీటి కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో మురుగు, వ్యర్థాలు నిలుస్తున్నాయి. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



హనుమకొండ నుంచి కాపువాడ వెళ్లే దారిలో..



వేయి స్తంభాల గుడి సమీపంలో..



హనుమకొండ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా..



హనుమకొండ చౌరస్తాలో..



వరంగల్ చౌరస్తా సమీపంలోని మేదరి వాడలో..



హనుమకొండ కాకాజీ కాలనీలో..

సమ్మెలోకి 100మంది పంచాయతీ కార్యదర్శులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో 100మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ పలు డిమాండ్ల సాధనకు సమ్మెలోకి వెళ్లారు. ఈక్రమంలో వారి స్థానంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ జగదీశ్వర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 208గ్రామ పంచాయతీలు ఉండగా, 129జీపీలకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వారిలో సుమారు 60మందికి నాలుగేళ్ల సర్వీస్ పూర్తయింది. ప్రభుత్వం, జేపీఎస్‌ల మధ్య గతంలో కుదిరిన ఒప్పందం, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జేపీఎస్‌ను రెగ్యులర్ చేయాల్సి ఉంది. కొంతకాలంగా ఈ విషయంలో ప్రభుత్వానికి కార్యదర్శులు విజ్ఞప్తులు చేస్తున్నా స్పందన లేకపోవడంతో సమ్మెలోకి వెళ్లారు. సమ్మెకు వెళ్లిన వారి సమాచారం తెలుసుకున్న జిల్లా అధికారులు.. మండల స్థాయి నుంచి సమాచారం తీసుకున్నారు. విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించి 100మంది స్థానంలో పలువురు అధికారులకు పంచాయతీ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు పొందిన వారిలో ఎంపీఓలు, ఎంపీఓలు, బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఏపీఓలు ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వారు జేపీఎస్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

గో సేవ.. దైవ సేవతో సమానం



గో సేవకులను సన్మానిస్తున్న సురేష్

హసన్‌పర్తి: మూగ జీవాలకు సేవ దైవ సేవతో సమానమని తెలంగాణ వెటర్నరీ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్ అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా చింతగట్టులోని మహర్షి గోశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక విలువలతో పశు వైద్య చికిత్సను కొనసాగిస్తూ మేలు జాతి పశువులను పెంపొందించి దేశాభివృద్ధికి కృషి చేయాలని వెటర్నరీ వైద్యులకు సూచించారు.

లేబర్ కోడ్ల రద్దుకు పోరాడుదాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: అంతర్జాతీయ శ్రామిక దినోత్సవం మేడే సందర్భంగా కార్మిక హక్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, లేబర్ కోడ్ల రద్దుకు సమష్టిగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. శంభునిపేటలోని గవిచర్ల క్రాస్‌రోడ్డు జంక్షన్‌లో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను విభజించి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసిందని వాపోయారు. బాలరాజు, జయబాబు, రాజేందర్, కరుణాకర్, హరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

నేత కార్మికుల ఉపాధి దెబ్బతీస్తున్నారు

వరంగల్: చేనేత వస్త్రాల పేరుతో మరమగ్గాలపై తయారు చేసిన వస్త్రాలను అమ్మి చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న బడా వ్యాపారుల అరాచకాలను అరికట్టాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, తూర్పు కన్వీనర్ కుసుమ సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సహాయ సంచాలకుడు రాఘవరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వెంకటరమణ, రవికుమార్, హరిశంకర్, వెంకటేష్, రఘునారెడ్డి, రాజ్‌కుమార్, మురళీకృష్ణ, రమేష్, ఉమేష్, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహిళా రిజర్వేషన్ల కల్పనలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

హన్మకొండ చౌరస్తా: మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాత లక్ష్మి విమర్శించారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షురాలు బంక సరళ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేసీఆర్ సర్కార్ వైఫల్యం చెందిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల పేరుమార్చి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. సంఘటితమై పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో బొంత సుజాత, చిదురాల స్వరూప, మోటె యామిని, జంగిలి లావణ్య, కమల, రజినీ, నాగపురి లలిత, తాళ్లపెల్లి మేరీ, అనిత, ఇందిర, సంగీత పాల్గొన్నారు.

నూతన మత్స్య సొసైటీకి ఉత్తర్వులు

హన్మకొండ చౌరస్తా: ఖిలా వరంగల్ మండలం అల్లీపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మత్స్యశాఖ సొసైటీ సభ్యులకు హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బుస్స మల్లేషం మాట్లాడుతూ 70 మందితో నూతన సొసైటీ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ మత్స్యశాఖ సంఘం మాజీ డైరెక్టర్ నీరటి సదానందం, బోళ్ల బాబు, బండి రాజు, లక్క రాజు, పిట్టల నరేష్, శీలం సాంబయ్య, బండి మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందుకుంటున్న సొసైటీ సభ్యులు

ధర్నాకు తరలిన న్యాయవాదులు

వరంగల్ లీగల్: న్యాయవాదుల హక్కులు, రక్షణ కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు వరంగల్ నుంచి న్యాయవాదులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది సారంపెల్లి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులందరికి హెల్త్‌కార్డులు జారీ చేయాలని, హెల్త్ స్కీమ్‌లో బీమా పరిమితిని రూ.ఐదు లక్షలు వరకు పెంచాలని, హెల్త్ స్కీంలో మెటర్నిటీని పొందుపర్చాలని, వయో పరిమితి నిమిత్తం లేకుండా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు వేణుగోపాల్‌రావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాకస్వామి, మద్రి రాజు, ఓదెలుయాదవ్, మాదం సంపత్, సాయిని నరేందర్, అంకేశ్వరపు రాజేంద్రప్రసాద్, వీరేష్, అనిల్, తులిసె, రాజబాపు, ప్రవీణ్‌కుమార్, నిఖిల్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్తంగా

మొరం అక్రమ దందాను అరికట్టాలి

దేశాయిపేట: 3వ డివిజన్ పైడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ చెరువు శిఖం భూమిలో మొరం అక్రమ దందాను వెంటనే నిలిపివేయాలని అఖిల భారత మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు మొరం తవ్వకాలు చేపట్టిన ప్రాంతాలను స్థానిక రైతులు, పెద్దలతో కలసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురుగునీటి గుంతను పూడ్చివేయాలి

ఖిలా వరంగల్: జనావాసాల్లో ఉన్న మురుగునీటి గుంతను వెంటనే పూడ్చివేయాలని సామాజిక కార్యకర్త పెరుమల్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటలోని మోమిన్‌పురలో ఇళ్ల మధ్య ఉన్న గుంతలను స్థానిక సామాజిక కార్యకర్తలు కేడల ప్రసాద్, ఫసితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి మురుగు కుంటలో పూలు చల్లి నిరసన వ్యక్తం చేశారు.

ఇందిరానగర్‌లో ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఫార్మాసిస్ ఆధ్వర్యంలో సామా జగన్మోహన్ రెడ్డి 41వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని ఇందిరానగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. 8, 9వ డివిజన్లకు చెందిన వృద్ధులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ తెలంగాణ ప్రాంత ప్రముఖ్ డాక్టర్ మాసాడి బాబురావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ బి.మోహన్‌రావు, డాక్టర్లు భగీరథ్, సనత్, అజిత్, హరీష్, రాజేశ్ పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: మే 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చాత్ల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో సభ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బహున సమాజ్ పార్టీ నాయకులు నితిన్, శ్రీకాంత్, ఇల్లందుల నరేష్, వినోద్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా తాళ్ల విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశంతో కలిసి చిన్నారి గాయని అపూర్వరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చిన్నారులు ఆట, పాటలతో అలరించారు. చదువులతో పాటు ఆటపాటల్లో రాణిస్తున్న విద్యార్థులకు చైతన్య యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దామోదర్ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే, సినీగాయని అపూర్వరెడ్డిని సన్మానించారు. ఉత్సవాల్లో పాఠశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, డాక్టర్ వరుణ్, వైష్ణవి, సినిమా మ్యూజిక్ డైరెక్టర్ మల్లిక్, ఆర్.వేలు, అఫ్జల్ ఉన్నీసా, శ్రావణ్, స్వర్ణ, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

మడికొండ: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టగా ఇద్దరికి గాయాలైన సంఘటన రాంపూర్ కపిల్ బ్రెడ్ కంపెనీ ఎదుట శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన బస్కె రాజేందర్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపెండ్యాలకు భార్య, కుమారుడిని తీసుకొని వెళ్తుతున్నాడు. ఈక్రమంలో కపిల్ బ్రెడ్ కంపెనీ వద్ద బ్రెడ్ కోసం ద్విచక్రవాహనాన్ని కంపెనీ వైపు తిప్పాడు. ఆ సమయంలో రాంపూర్ నుంచి కాజీపేట వైపు బైక్‌పై రాజేందర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆ రెండు బైక్‌లు ఢీకొట్టగా రాజేందర్, అతని భార్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖిలా వరంగల్: ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవిమాత కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ గంప నవీన్‌కుమార్, వాసవి క్లబ్ రీజియన్ సెక్రటరీ చిట్టిమల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి రామన్నపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో వనమాల శ్రీనివాస్, మాశెట్టి నర్సయ్య గుప్తా, ఇనుమల పల్లి శ్రీధర్, బోనగిరి రాజన్న, జగదీశ్వర్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసక్తిగల కోర్సుల్లోనే చేర్పించాలి

దేశాయిపేట: విద్యార్థుల ఆలోచన, ఆసక్తి, అభిప్రాయాల మేరకు వారికి నచ్చిన కోర్సులోనే చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జేఎస్.పరంజ్యోతి అన్నారు. దేశాయిపేట రోడ్డులోని పాఠశాలలో జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన ఏడుగురు విద్యార్థులను శనివారం అభినందించారు.

మార్కెట్ కార్యదర్శి చందర్‌రావుకు సన్మానం

ఖిలా వరంగల్: నల్గొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌కు గ్రేడ్ –1 కార్యదర్శిగా పదోన్నతి బదిలీపై వెళ్తున్న వరంగల్ 39వ డివిజన్‌కు చెందిన వరంగల్ వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ –2 కార్యదర్శి చందర్‌రావును ఖిలా వరంగల్ ఫోర్ట్ ఫిరంగ్ గ్రూప్ ప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి రవిందర్, పెరుమాండ్ల మధు, యాకూబ్, కైలాస్‌యాదవ్, డాక్టర్ సంపత్, వేణుమాధవ్, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

2న ఆర్యవైశ్య సంఘం బ్రహ్మోత్సవాలు

వరంగల్ చౌరస్తా: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 2వ తేదీన భద్రకాళి, భద్రేశ్వర్ల కల్యాణ మహోత్సవం సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ మేయర్, సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రావు తెలిపారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు వీరన్న, వీర మల్లయ్య, కార్యవర్గ సభ్యులు పోకల చందర్, రమణయ్య, కొండూరు శివప్రసాద్, నాగరాజు, వీరభద్రయ్య, సదాశివుడు, రాజన్న, గోపీనాథ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సిమ్ కార్డుల పంపిణీ

వరంగల్ చౌరస్తా: భారతీయ జనతాపార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం ఐటీ – సోషల్ మీడియా అత్యవసర సమావేశం వరంగల్‌లో శనివారం జరిగింది. సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 24 డివిజన్ల సోషల్ మీడియా కన్వీనర్లకు రాష్ట్ర కమిటీ అందజేసిన సిమ్ కార్డులను అందజేశారు.

రైల్వే ఆలయంలో అన్నదానం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని హనుమాన్ ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు, మాలధారులకు శనివారం అన్నదానం చేశారు. నిర్వాహకులు పి.పరశురాములు, సత్యనారాయణ శర్మ, ఎఎస్‌ఆర్.ప్రసాదరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

'వాగ్దేవి'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరులోని బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కమలయాదవ్ మాట్లాడుతూ ఎంపికైన 10 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

కాశిబుగ్గ: వరంగల్ – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే అధికారులు శనివారం చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను ఆయా రైల్వే స్టేషన్ల మధ్య నిలిపివేశారు. ఇంజనీరింగ్ బ్లాక్ అనంతరం రైళ్ల రాకపోకలు కొనసాగాయి.

ఎంసెట్‌లో ర్యాంకులు సాధించాలి



మాట్లాడుతున్న అక్బర్, రాజ్‌మహ్మద్

న్యూశాయంపేట: ఎంసెట్‌లో విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించి మైనార్టీ గురుకులాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్ (ఎంఆర్‌పీఎఫ్) గౌరవ అధ్యక్షుడు సయ్యద్ అక్బర్, అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌మహ్మద్ కోరారు. హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్డులోని వరంగల్ –1 బాలికల మైనార్టీ గురుకులంలో శనివారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంసెట్ క్రాష్ కోర్సు స్వల్పకాలిక శిక్షణా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ దాసరి కృష్ణకుమారితో కలసి ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా పరీక్షల్లో అనుసరించాల్సిన మెలకువలను అక్బర్, రాజ్‌మహ్మద్ విద్యార్థులకు వివరించారు.

మేలో కార్మిక మాసోత్సవాలు



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: నియోజకవర్గంలో మే నెలలో కార్మిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. రెవెన్యూకాలనీలోని కార్మిక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లుగానే ఈసారి కూడా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికుల హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మానస, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి ఇళ్ల పట్టాలు



మడికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

మడికొండ: అర్హులైన వారందరికి 58జీఓ ప్రకారం ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ హామీ ఇచ్చారు. మడికొండలోని ఎంఎస్‌ఆర్‌నగర్‌ను ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలు ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వం

వరంగల్: పేదల ప్రభుత్వం.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 14వ డివిజన్‌లోని సుందరయ్యనగర్, చాకలి ఐలమ్మనగర్, కారల్‌మార్క్స్ కాలనీల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

హసన్‌పర్తి: జీఓ 58 ద్వారా అర్హులైన నిరుపేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందిసుతన్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ పలివేల్పుల, 2వ డివిజన్‌లోని భగత్‌సింగ్ నగర్‌కాలనీల్లో ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న వారికి శనివారం ఎమ్మెల్యే రమేష్ పట్టాలు పంపిణీ చేశారు.

ఆగం చేయడం తప్ప బాగు చేయడం లేదు



పనులను పరిశీలిస్తున్న రాకేష్‌రెడ్డి, నాయకులు

హన్మకొండ: బీఆర్‌ఎస్ పాలకులకు ప్రజలను ఆగం చేయడం మీద ఉన్న ఆరాటం బాగు చేయడంలో లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. హనుమకొండ సమ్మయ్యనగర్‌లో శనివారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డక్ట్ అండ్ డ్రైన్ పనులను పరిశీలించారు. పనులు నత్తనడకన నడుస్తుండడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ 53వ డివిజన్ అధ్యక్షుడు జగన్ రెడ్డి, నాయకులు నాగమల్ల సంతోష్, సారంగపాణి, వేముల జైపాల్, సాయి యాదవ్, ఎం.శ్రీనివాస్, మస్తాన్, మహేందర్, వెంకటేష్, తిరుపతి రెడ్డి, అశోక్, కొమురయ్య, సతీష్, శ్రావణ్ యాదవ్, సందీప్‌రెడ్డి, దినేష్, లక్ష్మణ్, రమేష్, శివరాం, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.